# పునరావృతం



నదీ గర్భంలోకి జారిపోతున్న సూర్యుడ్ని చూస్తూ నిలబడ్డాడు శంకరం.

తనతోపాటు ఆకాశాన్ని ఎర్రపడచేయడం కాకుండా నీళ్ళలో మునిగి నీటినికూడా రక్తవర్ణంతో నింపుతున్నాడు. సూర్యుడితోపాటు మన దినచర్యకూడా ముగిసిందని తెలుసుకున్న పక్షులు అరుచుకుంటూ గూళ్ళకి చేరుకుంటున్నాయి. దూరంగా రైలువంతెనమీద రైలుకూడా వంటరిగా తనమీద ప్రయాణం చేస్తున్న ఆడవాళ్ళని సూర్యుడుండగానే అడంగుకి చేర్చాలని తహతహలాడుతూ, సిగ్నల్ ఇవ్వనివాళ్ళమీద కోప్పడుతున్నట్టుగా గావుకేకపెడుతూ నిట్టూర్చింది!

దూరంగా ఊళ్ళోనూ, మరొకవైపు బారేజిమీదా దీపాలు గప్పున వెలిగాయి. రిస్ట్‌వాచివంక చూసుకున్నాడు శంకరం. ఆరున్నరయింది. "అసలు ఈ ప్రపంచంలోని చైతన్యానికంతకూ మూలపురుషుడు సూర్యుడు కాబోలు" అనుకున్నాడు శంకరం. ఇక తను కూడా ఇంటికి చేరుకుంటే..... సావిత్రితో సినిమాకివెడదాం అన్నమాట గబుక్కున గుర్తుకొచ్చింది అతనికి—"

"పాపం పిచ్చిపిల్ల, నాకోసం ఎదురు చూస్తుంటుంది" అనుకుంటూలేచి నిలబడి ఇసుకలో రెండడుగులు వేశాడు. అంతలో—

కొంచెం దూరంగా బట్టలుతుక్కుంటున్న చాకలివాళ్ళ వైపునుంచి ఒక్కసారి గోలగా మాటలు, అరుపులు వినబడ్డాయి! శంకరం అటు చూశాడు. కొంతమంది పరుగెత్తుతున్నారు. ఇంకొంతమంది ఏమిటో అరుస్తున్నారు.

మొత్తానికి అతను గ్రహించింది నదిలో ఎవరో పడిపోయారని! గబగబ పరుగెత్తుతూ తనుకూడా వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. నీళ్ళలో నుంచి ఒక మనిషిని భుజంమీద వేసుకుని తీసుకువస్తున్నాడు ఒకతను!

దగ్గరగా వెళ్ళాడు శంకరం.

స్పృహతప్పిపోయిన ఆమనిషిని ఇసుకలో పడుకోబెట్టి చుట్టూ మూగారు—చోద్యం చూస్తున్నట్టుగా! శంకరం వాళ్ళలోకి చొరబడి వారినందరినీ సర్ది, ఆమనిషికి గాలి బాగా తగిలేట్టుగా చేశాడు. తరువాత తన వైద్యవిజ్ఞానం అనుసరిస్తూ, అతని పొట్టమీద మెల్లిగా ఒత్తుతూ నీళ్ళు కక్కించడం మొదలుపెట్టాడు. ఒక అయిదు నిముషాలు అలా గడిచాక అతను తెప్పరిల్లి—

"ఎక్కడున్నాను?" అన్నాడు నీరసంగా.

"కులాసాగా ఉండావు లేవయ్యా—డాక్టరుబాబు ఒడ్డుకి రాబట్టి!" అన్నాడు నిలబడ్డవాళ్ళలో ఒకతను.

"నిన్ను ప్రేమించినవారి కందరికీ లభించేది కన్నీరే అన్నమాట నాపట్ల కూడా ఋజువుచేశావు" అంటూ ముఖం చేతుల్లో దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది సావిత్రి!

ఆ మాట వినగానే "అయితే నేను చావలేదన్న మాట" అంటూ విస్ఫ్రహతో ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు.

"అదేందీ, మాటాడుతూనే 'చావలేదుగా'అనడుగు తాడు" అన్నాడు ఇంకొకతను.


అందరూ గలగల నవ్వారు. ఒక మనిషిని రక్షించ గలిగాం అన్న సంతృప్తి ఉంది వాళ్ళ నవ్వులో!

"ఎందుకు నన్ను చావనీయరు? నన్ను బ్రతికిం చేందుకు మీకేం హక్కుంది?" అన్నాడతను బాధగా.

అందరూ తెల్లబోయారు. శంకరం మట్టుకు "మిస్టర్ ఆవేశపడకండి. చంపేందుకు ఆ భగ వంతుడికి తప్ప చచ్చేందుకు ఏ మనిషికి హక్కులేదు. తెలుసా? పద అలా ఊళ్ళోకివెళ్ళి కాస్త కాఫీ అది తాగుదాం!" అన్నాడు.

"నా కీలోకంలో ఎవరూ లేరు—నే నిక్కడనుంచి రాను. మీరంతాపోయాక చస్తాను. ఎవరడ్డొ

# సింగరాజు రామచంద్రమూర్తి



స్తారో చూస్తాను" అన్నాడు పెంకిగా.

జాలేసింది శంకరంకి. అతన్ని ఒకసారి నఖశిఖ పర్యంతం చూశాడు. మనిషి సంస్కారం కలవాడని, ఒకప్పుడు బాగా బ్రతికినవాడని గ్రహించాడు. "ప్చ్, ఏదో అనుకోని సంఘటన జరిగిఉంటుంది మనిషి దెబ్బతినేశాడు" అనుకున్నాడు శంకరం. అతని

భుజంమీద చేయివేసి తడుతూ "చావడం అంత తేలికకాదు బ్రదర్—నిన్నిక్కడ వదిలివెళ్ళిపోయేటంత తెలివి తక్కువవాళ్ళంకాదు మేమంతా! అంతగా మరీ నువ్వు మొండికేస్తే నీతోపాటు నేను కూడా ఇక్కడే ఈ చలిలో ఉండిపోవలసివస్తుంది. నీతోటి మానవుడిని బాధపెట్టడం నీకిష్టమా?" అనడిగాడు అతనివంక నిశితంగా చూస్తూ.

శంకరంవంక నిస్పృహయంగా చూసి మాట్లాడకుండా లేచి నిలబడ్డాడతను. శంకరంకూడా లేచి అతనికి ఆసరాగా అతన్ని అనుకుని "ఒకమనిషి ప్రాణం కాపాడారు మీరందరూ— ఇక అతన్ని చూసే బాధ్యత నాది" అన్నాడు చుట్టూఉన్న వాళ్ళతో.

ఎవరూ ఏమీ మాట్లాడకుండా నిలబడ్డారు. శంకరం ఖరీదయిన బట్టలు అవీ చూసి అతను 'తమలోని' వ్యక్తి కాదని గ్రహించారు.

అతన్ని నడిపించుకుంటూ బయల్దేరాడు శంకరం. వెనక ఉన్నవాళ్ళంతా ఒక్కసారి ప్రాణం వచ్చినట్లుగా గలగల మాట్లాడటం మొదలెట్టారు.

"నీళ్ళలోకి దిగుతాఉంటే స్నానానికి అను కున్నాను మావా, ఇంకాస్సేపాగి చూసినా — వారంగా మనిషి ఫికరులేదు! అవతాన గబుక్కున ఏటిలోకి వద్దాను" అంటున్నాడు నీళ్ళలోకి దిగినతను.

"మేమందరం ఇటుకేసి ఉంటే నువ్వసలు అటు వైపు ఎందుకు చూసినా వేహ!" అడిగారు ఎవరో.

కొందరు కిసుక్కున నవ్వారు. ఎవరో అన్నారు— "రంగి అటువక్క నిలబడిందిరా బట్టలు ఆరేస్తూ— ఈడు నోరు తెరుచుకుని దాన్ని చూస్తున్నాడు. ఆ వెనకేగా ఆయన నీళ్ళలోకి దిగింది....."

వాళ్ళ మాటలు వినబడేదాకా విని నవ్వుకున్నాడు శంకరం. గట్టెక్కి కారులో అతన్ని కూర్చోబెట్టి తను స్టీరింగు దగ్గర కూర్చున్నాడు. కారు మెల్లగా ఊరివైపు సాగిపోయింది.

కాఫీహోటలునుంచి అలా ఊరులో కాసేపు తిరిగి ఇంటికి తీసుకుపోయాడు శంకరం. ఇలా తిరిగిన అరగటంలో అతనిపేరు చలపతి అని తెలుసుకోవడం మినహా అతన్ని గురించి మరేమీ అడగలేదు శంకరం. కాకపోతే చలపతిలో ఉన్న బెరుకు పోగొట్టేందుకు చేయుగలిగినదంతా చేసి ఇంటికి తీసుకొచ్చాడు!

సినిమాకి వెడదామని చెప్పిపోయిన అన్నగారు ఎనిమిది దాటినా రాకపోవడంతో సావిత్రికి కోపం అఘమేఘాలమీద వచ్చేసింది. బయటనే నిలబడి రాగానే కోపాన్ని వర్షించేద్దామనుకున్న సావిత్రికి శంకరంతోబాటు మరొక సరికొత్త మనిషి దిగటం ఆశ్చర్యం కలిగించింది....

"సావిత్రీ—మన రంగడ్ని బాత్‌రూంలో వేడి నీళ్ళు తోడమని రెండు టవల్స్, నా షేవింగ్‌సెట్టు అక్కడ పెట్టమను. తరువాత......ఓ—ఈయన్ని పరిచయంచేయలేదు కదూ—వీరి పేరు చలపతిరావు. నాకూ ప్రస్తుతానికి అంతకన్న ఎక్కువ తెలియదనుకో! ఇది మా చెల్లెలు—సావిత్రి" అంటూ పరిచయాలు చేశాడు శంకరం.

చలపతి సిగ్గుపడుతూ ప్రతి నమస్కారం చేశాడు.

# పునరావృతం

"మీరు ముందు షేవింగ్, స్నానం కానిచ్చిరండి— తరువాత మాట్లాడుకుందాం" అని అతన్ని బాత్ రూముకేసి తీసుకుపోయాడు.

భోజనాలయ్యాక మూడు కుర్చీలు వెన్నెట్లో వేయించుకుని బయట కూర్చున్నారంతా.

ఊరుకి కొంచెం వెడంగా ప్రశాంతమయిన ఆ ఇల్లు — ఇంటిచుట్టూ పూలతోటా, గాలి అందంగా మందంగా వీస్తూ నైట్‌క్వీన్ పరిమళాలు మోసుకొచ్చి అందిస్తోంది. మంచివాడి మనస్సులా నిర్మలంగాఉన్న ఆకాశంలో వెలుగుతున్న చంద్రుడు అందమయిన ఆడదాని చిరునవ్వులాంటి వెన్నెల కురిపిస్తున్నాడు.

చలపతి ఈ కొత్త వాతావరణానికి ముగ్ధుడయిపోతున్నాడు. సావిత్రి ఎటో చూస్తూ మధ్యమధ్య అతనివంక చూసి ఆశ్చర్యపోతోంది—" ఇందాకటి మనిషికి ఇప్పటికి అవతారంలో ఎంతటి భేదం ?" అని.

## అమాయకత్వము

ఒక తె:-అ క్కా య్! మన పనిమనిషి రాలేదేం?

మరొక తె:-ఏడ్చింది, ఒక రోజొస్తే మూడు రోజులు బకాయి. దాని పనీ అదీను...

ఒక తె:-(ఆశ్చర్యంగా)ఎందుకేడ్చిం దక్కాయ్.........

దాని అమాయకత్వానికి యింకేమి సమాధానం చెప్పాలో తెలియక కడుపుబ్బ నవ్వుకుంది మరొక తె.

సీమకుర్తి అహల్యాబాయి
(హైదరాబాదు)

అంతవరకూ చంద్రుడ్ని చూస్తూ కూర్చున్న శంకరం "చలపతిగారూ, మీకు అభ్యంతరం లేకపోతే ఇందాకటి మీపనికి కారణం చెప్పుతారూ" అనడిగాడు కుతూహలంగా.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. చెపుతాడా చెప్పడా అన్న ఉత్కంఠతో వాయుదేవుడు కాసేపు ఊపిరి బిగపట్టి చలపతి ప్రారంభించగానే తృప్తిగా నిట్టూర్చాడు.

"ఆత్మహత్యకి ప్రయత్నించడం పాపమని— పిరికితనానికి చిహ్నమనీ నాకూ తెలుసు. కాని పరిస్థితులు ఒక్కొక్కసారి మనిషిని పిచ్చివాడినిగా చేస్తాయి. తనని అమితంగా ప్రేమించినవారు పోతూఉంటే నిస్సహాయంగా, నాటకంలో ఒక ప్రేక్షకుడిలాగా చూస్తూ ఉండవలసిన పరిస్థితులు కలుగుతుంటాయి. అవే అవ్యక్తిలో "పెసిమిజం"ని కలిగిస్తాయి" అని కాసేపాగి—....

"నేను పుట్టినప్పుడు మా అమ్మకి బాలింత జ్వరం వచ్చిందిట. మా నాన్న మా అమ్మని కంటికి రెప్పలా చూసుకునేవాడుట. అందువలన ఖంగారుపడిపోయి డాక్టరుకోసం పరుగెత్తాడు. కాని ఆమెని ఎలాగయినా రక్షించుకోవాలన్న ఆతృతలో పరిసరాలు పరికించకుండా పోవడంలో పాపం లారీకిందపడి మా అమ్మకోసం కలవరిస్తూనే స్వర్గస్థులయ్యారు.......నేను కన్ను తెరవకముందే మా నాన్నని చంపి ఈ లోకంలో పడ్డాను.

"మాది అసలే బీదకుటుంబం — మా నాన్న ఉన్నప్పుడు ఆయన తెచ్చే నాలుగురాళ్ళతో మొత్తానికి గుట్టుగా గడిచిపోయేది కుటుంబం. ఆయన పోవడంతో నన్ను, అన్నయ్యని పెంచి పెద్దచేసే బాధ్యత మా అమ్మమీద పడ్డది. ఆవిడ ఆ విషమ పరీక్షని ధైర్యంగా ఎదుర్కొంది. ఒకరింట్లో వంటకి కుదిరింది. మధ్యాహ్నంపూట కారాలు, ఉప్పులు దంచడం — అప్పడాలు వగైరా చేసి పెట్టడం, వంటపనులుచేసి తన శరీరంలోని శక్తిని అమ్ముకుని మాకు ఏ లోపం రానిచ్చేది కాదు.

"పుట్టగానే తండ్రిని పొట్టబెట్టుకున్నాడు" అని ఎవరయినా అంటే వాళ్ళు వెళ్ళాక నన్ను కావలించుకుని "నువ్వు పుట్టాక నా చేతుల్తో నిన్ను పెంచిందిలేదు నాయనా — అన్నీ అన్నయ్యమీదే వదిలేశాను" అని ఏడ్చేది.

నేను మొదటినుంచీ బలహీనంగా ఉండేవాడిని కాని మా అన్నయ్యమట్టుకు మంచి ఆరోగ్యంగా ఉండేవాడు. వాడు నాకన్న నాలుగేళ్ళు పెద్ద. అమ్మ పొద్దున్నే మాకోసం అన్నం వడేసి పోతే అన్నయ్య నాకు నీళ్ళుపోసి అన్నంపెట్టి తను తిని బడికి తీసుకుపోయేవాడు. వెళ్ళేప్పుడు నా చేయి పుచ్చుకుని నన్ను ఒక పసిపిల్లాడిలాగా నడిపించేవాడు. ఈ రకంగా సాగిపోయింది కాలం నాకు పన్నెండేళ్ళు వచ్చేవరకు. అప్పుడు నేను థర్డు ఫారం చదువుతున్నాను. మా అన్నయ్య స్కూల్ ఫైనల్‌లో ఉండేవాడు.

ఒకసారి దసరా శలవుల్లో మా అన్నయ్య స్నేహితులంతా కృష్ణలో స్నానానికి బయలుదేరారు. నేను లేకుండా వాడెక్కడికి వెళ్ళేవాడుకాదు. అందుకని మా అన్నయ్యని స్నేహితులు ఏడిపించేవాళ్ళు కూడా—"నీ పిల్లాడు ఏడిరా?" అని. ఎవ్వరినీ లక్ష్యపెట్టేవాడుకాడు. ఒకవేళ కోపం వచ్చిందంటే అవతలివాడి రక్తం కళ్ళచూసేవాడు.

స్నానానికి నీళ్ళలోకి దిగుతూ "చలపతీ, నీళ్ళు సుడులుతిరుగుతున్నాయి — నువ్వు ఒడ్డున కూర్చో" అన్నాడు మా అన్నయ్య.

నురుగులు కక్కుతూ గట్లని ఒరుసుకుని ప్రవహిస్తున్న కృష్ణవేణినిచూసి ఎందుకో నాకూ అక్కడా స్నానం చేయాలన్న వెధవ కోరిక కలిగి "నేనూ వస్తానన్నయ్యా" అన్నాను.

నేను కోరానంటే దాన్ని వాడెప్పుడూ కాదనలేదు. దానికితోడు మిగిలినవాళ్ళు "ఎందుకురా శర్మా! మరీ అంత భయం—మన మధ్యగా నిలబెడదాం రానీయ్" అంటూ నన్ను నీళ్ళలోకి లాగారు.

కొద్దిసేపు లోతు ఎక్కువగాలేని ప్రదేశంలో

నిలబడ్డారంతా. కాని ఆటలధ్యాస హెచ్చినకొద్దీ లోపలికి పోసాగారు. వాళ్ళతోపాటు నాకు తెలియకుండానే నేనూ పోయాను. ఇంతలో ఎవరో విసిరిన అరటిపండు ఒకటి నా ముందునుంచి కొట్టుకుపోతుంటే గబుక్కున దానికోసం అటుపక్కకి పోయాను. అలా ఎంతవరకు పోయానో నాకే తెలియదు. ఇంతలో నేల అందక మునిగిపోవడం మొదలెట్టాను. ఒకటి రెండుసార్లు బయటపడేందుకు ప్రయత్నించాను గాని.....నాకు స్పృహ వచ్చేప్పటికి ఒడ్డున ఇసకలో పడుకుని ఉన్నాను మా అన్నయ్య స్నేహితులు భయంతో ఏదో అరుస్తున్నారు. ఇద్దరు ముగ్గురు ఏడుస్తున్నారు. ఎవరో పెద్దవాళ్ళు నీళ్ళలో దిగి నీళ్ళలో వెతుకుతున్నారు. కాని—కాని నాకు మా అన్నయ్య కనబడలేదు అక్కడున్న వాళ్ళలో గుండె గుభేలుమంది!

తరువాత నాకు తెలిసిందేమంటే—మునిగి కొట్టుకుపోతున్న నన్ను చూసి ఒక్క ఊపున నాదగ్గరకువచ్చి ఆ గుండంలోంచి నన్ను బలంగా బయటికి తోశాడుట మా అన్నయ్య. దాంతో నేను ఇటు మెరక ప్రదేశానికి వడ్డానుకాని ఆ ఊపుకి మా అన్నయ్య మటుకు ఇంకా లోపలికి పోయాడు. ఆ పోవడం మళ్ళీ బయటికి రాలేకపోయాడు!

ఆ రాత్రి మా అమ్మ గుండెలు పగిలేట్టు ఏడవడం నా కిప్పటికీ గుర్తుంది. "చేతికందివస్తున్నావని ఆశపడుతున్న నన్ను వదిలిపోయావా నాయనా" అంటూ ఏడిచింది. ....నాకోసం బలిఅయిన రెండవ వ్యక్తి మా అన్నయ్య!

కాలం ఎవరికోసం ఆగదు. రోజులు గడిచిపోయాయి. నేను మా అమ్మ కష్టంమీద బి. ఏ. దాకా వచ్చాను. చదువుకుంటూనే కొన్ని ప్రయివేట్లుకూడా కుదుర్చుకుని కాలేజీ జీతంకి సంపాయించుకునేవాడిని అటువంటి ప్రయివేట్లలో ఒకటి వసంత!" అని కాసేపు ఆగాడు చలపతి.

సావిత్రి గబుక్కున అతనివైపు చూసి మళ్ళీ చంద్రుడి వంక చూడసాగింది. కథా కథనంవట్ల ఉత్సాహాన్ని ప్రకటిస్తూ చంద్రుడు మబ్బుల్లోంచి బయటికొచ్చాడు!

"వసంతవాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. వాళ్ళ ఇంట్లో ఎక్కడ చూసినా లక్ష్మి తాండవమాడేది. అప్పుడు వాసంతి మెట్రిక్ చదువుతోంది. నాకన్న అనుభవం ఉన్నవాళ్ళు, ఇంకా బాగా చదువుకున్న వాళ్ళు వచ్చి ఉండేవారు ఆ అమ్మాయికి చదువు చెప్పేందుకు. కాని మా అమ్మ పనిచేస్తున్న ఇంటివాళ్ళ సిఫారసుమీద నా కప్పగించారు ఆ బాధ్యత. ఇరవయి రూపాయ లిచ్చేవాళ్ళు నాకు—అది కూడా ఉద్దేశం కేవలం నాకు సాయంచేయాలన్న ఉద్దేశంతోనే అనుకుంటా!

నేను ప్రయివేటు చెప్పటం ప్రారంభించిన కొద్ది రోజులకే నాతో చనువుగా మాట్లాడటం ప్రారంభించింది. కాని నా దృష్టికి మొదట్లో ఆమె కేవలం "విద్యార్థిని"గా తప్ప ఇంకోరకంగా కనబడేది కాదు. కాని క్రమేపి ఆమె నాతో చాలా చనువుగా ఉండటం, నాచేత 'నువ్వు' అనీ, "వాసంతీ" అనీ అనిపించుకోవడం—వీటిలతోటి ఆమెను ఒక వ్యక్తిగా చూడసాగాను. దాని పరిణామం ఆమె సౌందర్యం నన్నాకర్షించడం, ఆమె మూర్తి నా మనస్సులో చెరగని ముద్ర వేసుకోవడం. దాంతో మొదట చెప్పినంత స్వేచ్ఛగా చెప్పలేకపోయేవాడిని పాఠాలు. ఆమెకూడా పాఠాలమీదకన్న ప్రపంచ వ్యవహారాల మీద ఎక్కువ శ్రద్ధచూపించేది. తనతోపాటు నన్ను షికార్లకి, సినిమాలకి తీసుకు వెళ్ళేది. ఆమె నాతోఎంత చనువుగాఉన్నా అనుక్షణం మామధ్య ఉన్న వ్యత్యాసం నన్ను మళ్ళీ నిజపరిస్థితిని గుర్తింపచేసేది!

వాసంతికి తల్లి'తండ్రి లేరు. ఒక్కతే చెల్లెలు కావడంవలన వాళ్ళన్నయ్య ఆ అమ్మాయిని అతి గారాబంగా చూసేవాడు. అందువలన మొదట మే మిద్దరం కలిసి తిరిగితే పట్టించుకునేవాడుకాదు కాని క్రమేణా వాసంతి ఆంతర్యం నాకన్న ఆయనే ముందు పసికట్టి ఆమె స్వేచ్ఛని అటకాయించాడు.

ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్టుగా "నేను మాస్టార్ని చేసుకుంటాన"ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేసింది.


ఆమె అన్నగారు మొదట నమ్మలేకపోయారు. ఆగర్భ శ్రీమంతుల ఆడబడుచు దమ్మిడీచేయని వాడిని ప్రేమించడం వాళ్ళ వూహాకందని విషయం అయింది.

నాకు మనస్సులో ఆనందం కలిగింది కాని అంతలోనే బాధ కలిగింది. వాసంతికి నేను అన్ని విధాల తక్కువ వాడిని — ఆమెను చేపట్టేందుకు అనర్హుడిని. ఏదో ఉద్రేకానికిలోనై చేసుకున్న ఆమెనిర్ణయం ఆమె భవిష్యత్తుకే పెద్ద దెబ్బ అని ఆమెకు నచ్చచెప్పబోయాను.

"అయితే, నన్ను చేసుకోవడం మీ కిష్టంలేదా?" అని ఏడవడం మొదలెట్టింది

వాళ్ళన్నయ్య మట్టుకు ఖండితంగా చెప్పేశాడు "ఆ వంట మనిషికొడుకుని చేసుకుంటే నీకూ నాకూ తెగదెంపులే"నని.

ఆనందంగా ఒప్పుకుంది.




నన్ను బ్రతిమాలాడు. కావలసినంత డబ్బిస్తానని నా చెల్లెల్ని వదిలి మరో ఊరు వెళ్ళమన్నాడు. చివరికి బెదిరించాడు కూడా—వెళ్ళకపోతే చావ కొట్టిస్తానని.

నేనూ మొండి కేశాను. "వాళ్ళకి భయపడి వాసంతిని వదులుకునేంత పిరికివాడిని కాదన్నా"ను. అందులో నా స్వార్థం ఎక్కువనుకుంటా. ఆమె భవిష్యత్తుకన్న నన్ను గురించి నే నెక్కువ ఆలోచించాను.

మా అమ్మ నెత్తీ నోరు బాదుకుంది. "పెద్ద వాళ్ళతో మనకెందుకురా" అని ఏడ్చింది. కాని నేను పట్టించుకోలేదు.

వాసంతి అన్నగారు అన్నంతపనీ చేసిచూపించారు. స్పృహ తప్పేట్టు చావగొట్టి ఇంట్లో పడేశాడు. నాకు వంటిమీదకు తెలివివచ్చేసరికి కంటికెదురుగా వాసంతి కనబడింది.

సజల నేత్రాలతో వళ్ళంతా కళ్ళు చేసుకుని నావంకే చూస్తోంది. నేను తనవైపు చూడగానే "నావల్లనే మీ కీ అనర్థాలన్నీ" అంటూ నా మీదికి వాలిపోయింది

అంతే— ఆనాటినుంచి వాసంతి మా ఇంట్లోనే ఉండిపోయింది. వాళ్ళన్నయ్య "అసలు నాకు చెల్లెలు లేదనుకుంటా" అని తెగేసి చెపుతున్నాడని విని నవ్వుకునేది. నా కిప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. మా గర్భదరిద్రాన్ని వసంత ఎలా భరించేదా అని! ఏనాడూ పస్తెత్తి అనేదికాదు. ఆ దరిద్రమే మహద్భాగ్యంగా ఉన్నట్టు, నా సాన్నిధ్యమే అష్టయిశ్వర్యాలు అయినట్టు ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేది. 'గృహలక్ష్మి'లాగా మెదిలేది.

నేను బి. ఏ. పాసయినట్టు తెలిసేనాటికి వాసంతికి ఎనిమిదవ నెల. "ఇంక మనకి బాధలన్నీ పోతున్నాయిలెండి—మీకు ఎక్కడోక్కడ ఉద్యోగం వస్తుంది" అనేది నేనెప్పుడయినా "బాధపడుతున్నావు నా వలన" అంటే

మా అమ్మకి కోడలంటే పంచప్రాణా

మనం అనుకున్నవన్నీ అనుకున్నట్టు గుతే ఇంక కావలసిందేముంది. ఉద్యోగంకోసం ఎంత ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. పెట్టవలసిన వాటి కన్నిటికీ అప్లికేషనులు పెట్టాను కొన్ని ఇంటర్వ్యూలకి వెళ్ళాను. ఎప్పటికప్పుడే "మీ కివ్వకపోతే మరెవరి కిస్తారండీ—బి. ఏ. ఫస్టుక్లాసు. ఈసారి లాభంగా రావడం ఖాయం" అని చిరునవ్వుతో సాగనంపేది. కాని ఫలితంమట్టుకు మామూలు. రికమెండేషన్లు, అశ్రితపక్షపాతాలు వెర్రితలలువేసిన ఈ రోజుల్లో డిగ్రీలుచూసి ఉద్యోగం ఇచ్చే నాథుడెవరు? నాలాంటి ఫస్టుక్లాసులు ఎన్ని వందల మంది ఉన్నారో వాసంతి కేం తెలుసు!

చదువయితే చదువగలిగానుగాని రెక్కలు విరుచుకుంటున్న అమ్మకష్టం తప్పించలేకపోయాను నామీదే భారాన్నివేసి దరిద్రాన్ని ఆలింగనం చేసుకున్న వసంతని సుఖపెట్టలేకపోతున్నాను.

చివరికి వాసంతికి నెప్పులు ప్రారంభమయేసరికి మంత్రసానికి రిక్షాచేయించేందుకు డబ్బులు లేకపోయాయి ఎవడో మిత్రుడు ఇస్తే ఆ పబ్బం గడిచింది. తీరా మంత్రసాని వచ్చాక అంది—"లాభంలేదు. చాలా గడ్డు కాన్పు ఆస్పత్రికి తీసుకు

పోవాలి" అని. ఎక్కడనుంచి తీసుకురాను డబ్బు? డబ్బు లేకపోతే నా ముఖం చూసేదెవరు?...... కాలుగాలిన పిల్లిలా ఊరంతా తిరిగాను. అడ్డ మయినవాడిని అడిగాను. ఎవరికివారు తప్పు కున్నారు. మా అమ్మ వంటచేసే ఇంటి ఆయన్ని అడిగితే ఇదివరలో పుచ్చుకున్న మూటవిభయి ఇస్తే ఇస్తానన్నాడు.

మళ్ళీ ఇంటికి చేరుకున్నాను—పరిస్థితి మెరు గయిందేమోనన్న ఆశతో.

వాసంతికి వాతం కమ్ముకొస్తోంది. క్షణాలమీద ఆసుపత్రికి తీసుకుపోయి ఆపరేషన్ చేయించాలంది మంత్రసాని. పిండం లోపలే చచ్చిపోయిందట!

చివరికి అభిమానం చంపుకుని వాసంతి అన్న గారి ఇంటికి వెళ్ళి జరుగుతున్నదంతా చెప్పి ఒక్క పాతిక ఇవ్వమని బతిమాలాను.

"పోషించలేనివాడివి ఎందుకు చేసుకున్నావు? నా మాట విననినాడే పోయిందనుకున్నాను నా చెల్లెలు. గెటవుట్!" అన్నాడు కదలకుండా.

రాక్షసులు ఉండేవారని విన్నానుకాని నమ్మ బుద్ధయేదికాదు. కాని ఆనాడు రాక్షసత్వం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూశాను! తనతో రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలు మరణావస్థలోఉన్న దన్నమాట కూడా కదిలించలేని మనిషి ఎవరు?.... నాకు కోపం ఆగలేదు. నోటికొచ్చినట్టల్లా తిట్టేసి ఇంటికి చేరుకునేసరికి అక్కడి దృశ్యం నా రక్తాన్ని గడ్డకట్టించింది.

వాసంతి భౌతికశరీరంమీదపడి అమ్మ ఏడు స్తోంది!

నేను తిట్టివచ్చాక పశ్చాత్తాపపడినట్టున్నాడు కారేసుకుని పరుగెత్తుకొచ్చాడు వసంత అన్నగారు—పెద్దడాక్టరుతో సహా! శవాన్ని చూసి బావురు మన్నాడు.

నా అసమర్థతకి, స్వార్థానికి బలిఅయిన మూడవ వ్యక్తి నా వాసంతి—

తనని తల్లిలాగా ప్రేమించిన కోడలు మరణం మా అమ్మని మానసికంగా పూర్తిగా తలక్రిం దులు చేసివేసింది. అప్పటినుంచి 'ఫిట్స్' లాగా రావడం ఆ వచ్చినప్పుడు విరుచుకుపడిపోవడం వంటివి మొదలయాయి. పోనీ ఆమె చేస్తున్న పని మానిపిద్దామని ప్రయత్నిస్తే "నీకు ఉద్యోగం రానీయరా నాయనా" అని తప్పించేది.

వాసంతి పోయిన నెలలోపలే నాకు ఉద్యోగం వచ్చింది.నన్ను ప్రేమించి నా ఉన్నతికి కృషిచేసేవారిలో ఇక మిగిలింది మా అమ్మ ఒక్కతే.ఆమె బ్రతికినన్నాళ్ళు ఆమెని సుఖపెట్టడం కొడుకునయినందుకు నా కనీస కర్తవ్యం అనుకుని ఉద్యోగంలో చేరి యాం త్రికంగా పనిచేయసాగాను.

"ఉద్యోగం వచ్చిందికదా, ఇక నువ్వు ఆ పని మానెయ్యరాదా అమ్మా?" అన్నాను.

"నీకు జీతం రానీయి-తరువాత చూసుకుందాం" అంది.

కాని నా జీతం వచ్చేంతవరకు ఆమె బ్రతక లేదు. ఒకరోజు వంటచేస్తూ ఫిట్‌లాగా వచ్చి పొయ్యి దగ్గిరే పడిపోయిందిట. బట్టకి నిప్పంటుకుని బాగా వ్యాపించాక కనుక్కున్నారు ఇంట్లోవాళ్ళు. నాకు కబురంది ఆసుపత్రిలో మా అమ్మని కలుసుకునేం



దుకు వెళ్ళేప్పటికే ఆమె కష్టాల కతీతురాలైంది!

...దాంతో ఇక నాకు ప్రపంచంలోని బంధాలన్నీ తెగిపోయాయనిపించింది. నాకోసం తపించిపోయేవా రెవరూ లేరు. ఈ విశాల ప్రపంచంలో నే నేకాకిని! ఎందుకు నాకీ ఉద్యోగాలు? ఎవరికోసం నేను పాటు పడటం? ఎవరిని చూసుకుని నేను బ్రతకటం! నాకంటికి ఎటుచూసినా శూన్యమే!" అని కాసే పాగి "వాళ్ళు నన్ను బయటికి లాగకపోతే ఈపాటికి నా వాసంతిని కలుసుకునే వాడిని"—ఏదో పోగొట్టు కున్నవాడిలా బరువుగా నిట్టూర్చాడు.

కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. అతను అనుభవించిన కష్టాలతో సావిత్రికి అతనిపట్ల సాను భూతికలిగి కళ్ళు ఆర్ద్రమయాయి. చివరికి శంకరం—

"మీ గతం అంతా కష్టాలతో గడిచింది. ఆత్మీ యుల్ని పోగొట్టుకున్నారు. కాని ఎటువంటి వైపరీత్యాలయినా కర్మప్రకారం జరగవలసినవే—అందులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మన కేదో ప్రమేయం ఉందనుకోవడం ఉట్టి భ్రాంతి! మనం పూర్తిగా నిమిత్తమాత్రులం" అని కాసే పాగి "జరిగిపోయినదంతా ఒక పీడకల అనుకోండి. ఈనాటినుంచి నవజీవనంకి నాంది పలకండి. మీ మనస్సు బాగుపడేదాకా మా ఇంట్లోనే ఉండాలి మీరు. ఇంట్లో ఉన్నది కూడా మే మిద్దరమే కాబట్టి మాకూ ఏమీ తోచడంలేదు. ముగ్గురం కలిసి సరదాగా గడుపుదాం" అన్నాడు శంకరం.

చలపతి అయిష్టంగా తలూపుతూ "నా గత చరిత్ర అంతా వినిక్కూడా మీరు నన్ను చేరదీస్తు న్నారు! 'స్పర్శవేది' అనేది ఉందో లేదోగాని నేను సరిగా దానికి వ్యతిరేకిని. నేను అడుగుపెట్టిన చోటల్లా నాశనం అయింది. నన్ను ప్రేమించిన వారికి నావలన లభించింది—బ్రతికున్నంతకాలం కష్టాలు, కన్నీరు. తరువాత మృత్యువు.....కాబట్టి నాదారిన నన్ను పోనీయండి" అన్నాడు.

> ఉపాధ్యాయుడు:- ఒరేయ్! గోపీ! హరిశ్చంద్రుని కాలంలో వున్న విశ్వామిత్రుడు, శ్రీరాముని కాలంలోఉన్న విశ్వామిత్రుడూ ఒక్కడే నని యెలా సమర్థించగలవురా?
>
> గోపీ:- హరిశ్చంద్రలోను సీతారామకళ్యాణంలోను విశ్వామిత్రుడుగా గుమ్మడే కదండి వేశాడు.
>
> జి. శివరామప్రసాద్ (కాకినాడ)

శంకరం ఫక్కున నవ్వేశాడు. "చూడండి చలపతిగారూ, నా కిటువంటి మూఢనమ్మకాలు లేవు. దిగతుడుపులుతీసి పారేసిన బియ్యం, నిమ్మ కాయలు పనికట్టుకుని తిని మా స్నేహితుల భయం పోగొట్టేవాడిని. కాబట్టి మీరు మాతో ఉండేందుకు ఇష్టపడినా పడకపోయినా ఇక్కడ ఉండా లిసిందే! ఒక గదిలోపెట్టి తాళం వేయిస్తాను. ఆ..." అని "విన్నావుగా అమ్మాయ్, ఈయన కూడా ఈ ఇంటిలో ఒక మెంబరు ఇహనుంచి. ఆయన లోని నిర్లిప్తతని పోగొట్టడం మానవులుగా మన బాధ్యత! అన్నట్టు మహాశయా — ఆత్మహత్య చేసుకో నని ఒక వాగ్దానం పడేయండి" అన్నాడు నవ్వు తూనే చలపతితో.

చలపతికూడా నవ్వేశాడు. "ఇక ఆ ప్రయత్నం ఎప్పుడూ చేయనులెండి" అన్నాడు మెల్లిగా.

సావిత్రి తృప్తిగా నిట్టూర్చింది.

డాక్టరుగా తన విజ్ఞానం అంతా ఉపయోగించి చలపతిని మానసికంగా మార్చి మళ్ళీ మామూలు మనిషిని చేయాలని శంకరం నిశ్చయించుకున్నాడు. చలపతికి ఒక ఉద్యోగంకూడా వేయించాడు. రోజులు గడుస్తున్నాయికాని చలపతిలోమటుకు ఆట్టే మార్పేమీ రాలేదు.

ఒకరోజు శంకరం—

"సావిత్రీ—నాకు సెలవు శాంక్షనయింది. సరదాగా అలా ఒక 'ట్రిప్' కొట్టి వద్దామా ఎక్కడి కయినా" అనడిగాడు ఇంట్లోకి వస్తూనే.

రేడియో ఆపి లేచి నిలబడి "ఎక్కడికి వెడదాం ?" అంది సావిత్రి.

"ఏం మిస్టర్ చలపతీ, మీ అభిప్రాయం ఏమిటి ?"

పేలవంగా నవ్వేశాడు చలపతి. "నాకు ఎక్కడి కయినా ఒకటే. అమాటకొస్తే నా కిక్కడే ఉండటం బావుంటుంది. మీ రిద్దరూ వెళ్ళి రండి. నే నింటికి కాపలాకాస్తూ ఉంటాను" అన్నాడు.

"నో, నో, మై డియర్ షేక్స్‌పియర్—ముగ్గురం కలిసి వెడదామనే ఈ కార్యక్రమం ఏర్పాటుచేసింది. అలా మద్రాసు వెళ్ళి అటు నుంచి మహాబలిపురం పోయి తరువాత ఏడుకొండల వాడిని సేవించుకుని వద్దాం—ఏమంటావు సావిత్రీ !"

"వండర్‌ఫుల్ అయిడియా. చలపతిగారూ, మూడింట రెండు ఓట్లు పడ్డాయి— ఇక మీరు కాదనటానికి హక్కు లేదు. ఇంతకీ ఎప్పు డన్నయ్యా ప్రయాణం ?"....

సముద్రతీరందాకా ఉన్న సరుగుడుతోటలు, ఎక్కడచూసినా సెలవు గడుపుదామని వచ్చిన జంటలు, కుటుంబాలు — కళకళ్ళాడుతూ ఉంది మహాబలిపురం. పల్లవరాజుల కాలంలో అఖండ శోభని అనుభవించినదానికి తార్కాణంగా మిగిలి పోయిన శిల్పాలు గత ఔన్నత్యాన్ని చాటుతున్నాయి. ఒక గైడుని ఏర్పాటుచేసుకుంటే అతను చెవిలో ఒకటే రొదచేస్తున్నాడని డబ్బిచ్చి అతన్ని వది లించుకున్నారు. "సెవెన్ పగోడాస్"లో ఆరు సముద్రగర్భంలో కలిసిపోగా ఏడవదాన్ని మటుకు చుట్టూ గోడకట్టి కాపాడారు. గుడిలోకి పోతే

సముద్రంలోకి చొచ్చుకుపోయినట్లు అనిపించింది సావిత్రికి.

అణాకి, అణాన్నరకి ఇచ్చే కొబ్బరిబోళ్ళాలని చూసినకొద్దీ తాగబుద్ధేసి కడుపు పట్టినంత వరుకు పట్టించేస్తున్నారు, శంకరం, సావిత్రి. చలపతి మాత్రం దూరంగా — "పాండవుల రథాల" దగ్గర కూర్చున్నాడు.

అతన్ని వెతుక్కుంటూ వచ్చిన సావిత్రి తదేకంగా అతను దేన్నో బొమ్మగీస్తుండటం గమనించి సడిచేయకుండా అతని దగ్గరకు పోయింది. శిథిలావస్థలోనున్న ఒక సుందరప్రతిమకు ప్రతిరూపం ఇస్తున్నాడు! చూసి ఆశ్చర్యపోయింది— అందులో గొప్ప కళానైపుణ్యం ద్యోతకమవుతోంది.

"మీరు బొమ్మలు చాలా బాగా వేస్తారే!" అంది ఆశ్చర్యంగా సావిత్రి.

ధ్యానానికి భంగంకలగడంతో ఉలికిపడి ఆమె వంక చూసి—"ఆఁఏదోలెండి. ఉబుసుపోకకి నేర్చుకున్నది" అని నవ్వేశాడు.

"అయితే ఆ రథం బ్యాక్‌గ్రౌండుగా పెట్టి నా బొమ్మ వేయండి" అని గబగబ వెళ్ళి అతనికి ఎదురుగా నిలబడింది ఫోటోకి ఫోజుపెట్టే ధోరణిలో.

ఒక చిత్రకారుడి దృష్టితో ఆమె నతను పరీక్షించసాగాడు ! .... తుమ్మెద రెక్కల్లాంటి వెంట్రుకలు, కోలముఖం, శంఖంలాంటి మెడని చుట్టుకుని సన్నని గొలుసు, గాలికి అలలుగా ఎగిరిపడే పమిట వంపులు దిద్దుకున్న శరీరం, సన్నటి నడుంని అంటిపెట్టుకున్న పాలనురగలాంటి చీర అందమయిన పాదాలతో దోబూచులాడుతోంది .... ' దివినుంచి దిగివచ్చిన .... అంతలో అతనికి ఇంకొకవిషయం హఠాత్తుగా స్ఫురించింది. అది సావిత్రికి తనభార్య వాసంతికి కొట్టవచ్చినట్టుండే పోలికలు. తన హృదయంలో ఉన్న ఆమెరూపాన్ని సావిత్రి పక్కన పెట్టి చూసుకున్నాడు. చాలా విషయాల్లో ఇద్దరూ ఒక్కలా కనపడ్డా రతనికి. చూడగా చూడగా తన వంటరితనానికి జాలిపడి దివినుంచి వసంతే దిగి వచ్చిందేమో అన్న సంభ్రమాశ్చర్యాలతో చూశాడు సావిత్రిని ! ఇన్నాళ్ళు తను ఈ విషయం గమనించకపోవడం అతనికే ఆశ్చర్యంగా తోచింది!

ఎప్పుడూ తనవంక నేరుగా చూడని చలపతి కొత్తరకం చూపుల్తో తన నఖా నఖశిఖ పర్యంతం నిశితంగా చూస్తుంటే సిగ్గనిపించింది సావిత్రికి. కాని చిత్రకారులింతే కాబోలు అనుకుంది అంతలోనే !

మొత్తానికి యాత్రలు ముగించుకుని వచ్చినప్పటినుంచి చలపతిలోని మార్పు శంకరం, సావిత్రి ఇద్దరూ గమనించారు. ఇప్పు డతనిలో వెనకటి నిర్లిప్తత లేదు — ఇది శంకరం తన ప్రయత్న ఫలితమే అనుకుని వెన్ను చరుచుకుని మురిసిపోయాడు !

కాని చలపతిలో అంతకన్న మరో ముఖ్యమయిన మార్పు గ్రహించకలిగింది సావిత్రి. అది తనపట్ల అతని ప్రవర్తన! ఇదివరుకు అన్నగారితో మాట్లాడినట్లే తనతోనూ మాట్లాడే చలపతి ఇప్పుడు తన సామీప్యంకోసం తహతహలాడుతున్నాడని—తనతో మాట్లాడటమే ఒక మహానందంగా భావిస్తున్నాడనీ తనతో సాధ్యమయినంత చనువుగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడనీ గ్రహించింది. ఇది ఆమెమనస్సును పులకరింపచేసింది. ఏవేవో ఆలోచనలతో ఆమె మోము రాగరంజితమయింది. ఎదురుచూస్తున్నక్షణం దగ్గర పడుతున్నట్లు భావించింది. అతను 'సావిత్రీ' అని చనువుగా పిలిచినప్పుడల్లా ఆమె హృదయం పరవళ్ళుతొక్కేది.

"సావిత్రీ — అలా బారేజి దగ్గరకు పోదాం వస్తావా ?" అనడిగాడు ఒకరోజు చలపతి.

"ఊఁ, మీరు రమ్మన్నాక తప్పుతుందా మరి!" అంటూ టాయిలెట్ అయేందుకు లోపలికి వెళ్ళింది.

ఆమె వెళ్ళినవైపుకే చూస్తూ ఆలోచిస్తూ నిలబడ్డాడు చలపతి. పదినిముషా లయాక "పదండి" అంటూ బయటికొచ్చింది. ఆమె తన పక్కన నడుస్తుంటే ఏదో అందదనుకున్నది అందుతున్నట్లు అనిపించిం దతనికి. కారెక్కి మెల్లిగా పోనిచ్చింది సావిత్రి!...

దూరంగా కనకదుర్గ కొండమీద దీపాలు ఒక్కసారి వెలిగాయి. గుడిగోపురాల కమర్చిన దీపాలు కన్నులపండువగా ఊరంతా కనబడుతున్నాయి.

"ఇవ్వాళ శుక్రవారం కదూ — గుడికివెళ్ళి తరవాత బ్యారేజికి వెడదాం" అంది సావిత్రి.

ఆమెవంకనే చూస్తూ "అలాగే, నువ్వు రమ్మన్నాక తప్పుతుందా మరి!" అన్నాడు.

ఇద్దరూ మెట్లెక్కి గుడిలోకి వెళ్ళారు. ఇసుకవేస్తే రాలకుండా ఉన్నారు జనం. అసలు ప్రతిరోజూ రద్దీగానే ఉన్నా శుక్రవారాలు మాత్రం అమ్మవారిదర్శనం అందటంకూడా కష్టమే.

"నువ్వు లోపలికి పద సావిత్రీ—నే నిప్పుడే వస్తాను" అని కొబ్బరికాయలబుట్ట సావిత్రి చేతికిచ్చి దేవస్థానం ఆఫీసుకి వెళ్ళాడు చలపతి. పూజకీ, నేరుగా గర్భగుడిలోకి వెళ్ళేందుకు టికెట్లు కొని మళ్ళీ వచ్చి ఆమెను కలుసుకుని లోపలికి తీసుకుపోయాడు.

పెండ్లయిన కొత్తల్లో వాసంతితో కలిసి ఇలాగే తను వచ్చినరోజు గుర్తుకి వచ్చి అతని కండ్లు చెమ్మగిలాయి. సావిత్రివైపు చూశాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

కాయలు, చీటీ యిచ్చి తన పేరు గోత్రం చెప్పాడు చలపతి. పూజారి "అమ్మాయిగారి పేరు" అనడిగాడు.

"సావిత్రి" అన్నాడు చలపతి.

పూజారి లోపలికి వెళ్ళిపోతూ ఉంటే "మరి నా గోత్రం అడగడే, నాకూ ఒక టికట్టు తేకపోయారూ ?" అనడిగింది సావిత్రి.

వెడుతున్న పూజారి వెనక్కి తిరిగి ఆమెవంక చూసి తరవాత చలపతివైపు తిరిగి ఫక్కున నవ్వి మరీ లోపలికి వెళ్ళాడు!

ఆయన చూపుకి, నవ్వుకి అర్థం గ్రహించిన సావిత్రి గబుక్కున సిగ్గుపడిపోయింది. చలపతి ఇవన్నీ చూసి అమ్మవారికి నమస్కరించటంలో లీనమయిపోయాడు—

కొబ్బరిముక్కలు అక్కడే పంచిపెట్టి మల్లిఖార్జునుడి గుడికి వెళ్ళి దిగివచ్చేశారు. దారిలో ఎవరూ మాట్లాడలేదు. ఇద్దరి మనస్సులూ ఆలోచనల్తో నిండి ఉన్నాయి. బ్యారేజిమీద మెర్క్యురీ దీపాలు వెన్నెల కురిపిస్తున్నాయి. నీటిమీదనుంచి వచ్చే చల్లటిగాలికి సావిత్రి ముంగురులు ముఖంతో దోబూచులాడుతున్నాయి. వాటిని అనుకరిద్దామని ఎగరబోయిన పమిట చలపతి ముఖానికి తగులుతూ అతన్ని గిలిగింతలుపెడుతోంది.

సావిత్రివైపు చూశా డతను. అమ్మవారి గుడిలో పెట్టుకున్న పెద్ద బొట్టువలన ఆమె ముఖంలో కళ ద్విగుణీకృతమయిందనిపించింది అతనికి. వాసంతి ఎప్పుడూ ఎర్రటి పెద్ద బొట్టు పెట్టుకుని కండ్లకి కాటుక పెట్టుకునేది. సావిత్రిముఖంలోకి చూశాడు — కండ్లకి నిండుగా కాటుక ఉంది. తల్లోని మల్లెమొగ్గలు అప్పుడే విచ్చుకుంటున్నాయి.

అతని మనస్సులో ఏదో ఆనందం, తన్మయత్వం ఆవరించాయి. సావిత్రి దగ్గరగా జరిగి ఆమెను రాసుకుంటూ నిలబడ్డాడు. ఆమెకూడా తనవైపుకి జరిగినట్టు అనిపించిం దతనికి! మెల్లిగా ఆమె నడుం చుట్టు చేయివేశాడు.

ఆమె కదలలేదు.

దగ్గరకు తీసుకున్నాడు—అతని భుజంమీదికి తల వాల్చేసింది. మల్లెల సౌరభం గుప్పుమంది ....

అలా ఎంతసేపు నిలబడ్డారో అతనికే తెలియదు. తనమనస్సులో కొన్నిరోజులుగా మెదులుతున్న మాటని అడిగివేద్దామని నోరు తెరవబోయాడు—

అంతలో సావిత్రి సుళ్ళుతిరుగుతున్న నీటివైపు చూస్తూ "రేపు బావ వస్తాడు" అంది మెల్లిగా.

(45-వ పేజీ చూడండి)




చిత్రకారుడు: కలువకొలను సదానంద
(పాకొల)

# మ న సరా వృ తం

(21-వ పేజీ తరువాయి)

మెను చుట్టుకున్న అతని చేయి జారిపోయింది. "ఎవరూ?" అనడిగాడు తడబడుతూ.

"మా అత్తయ్యకొడుకు డాక్టర్ పాసయి అమెరికా పోయాడు హయ్యర్ స్టడీస్‌కి అప్పుడే రెండేళ్ళయింది. రేపు వస్తున్నాడు!" అంది.

ఆమెకు కొంచెం ఎడంగా జరిగి "ఉహుఁ" అన్నాడు.

"అన్నయ్యా, భాస్కరంబావ కలిసి ప్రాక్టీసు పెడతారుట" అని కాసేపాగి ఏదో చెప్పాలని ప్రయత్నించి మళ్ళీ ఆగిపోయి మళ్ళీ అంతలోనే "వెళ్ళే ముందు మా అత్తయ్య నాన్నగారి దగ్గర మాట తీసుకుంది" అంది.

"ఏమని ?" వడుతున్న పిడుక్కి ఎదురుగా తల పెట్టాడు.

"హల్లో, ఇక్కడ ఉన్నారూ—అనుకుంటూనే వచ్చాను. వెరీగుడ్. పనిఉండి ఊళ్ళోకి వచ్చాను. ఇలా బారేజిదగ్గరకు వచ్చేసరికి మనకారు కనపడింది. ఏమిటి అలా ఉన్నాడు మన చలపతి ? మళ్ళీ మూడ్సులోకి రావయ్యా మహానుభావా !" అన్నాడు నవ్వుతూ శంకరం.

చలపతి బంగారుగా నవ్వబోయి "నో నో, ఏమీ లేదు. సావిత్రీ ! పోదాం రండి" అంటూ నడిచాడు శంకరం, సావిత్రి వెనక అనుసరించారు.

అరాత్రి పడుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టలేదు చలపతికి. ఎవరికోసం ఆశలు పెంచుకుని గతాన్ని విస్మరించి నవజీవితానికి నాంది పలుకుదామనుకున్నాడో ఆమె తనది కాదు. ఇక తన ఇంట్లో, ఈ ఊళ్ళో ఉండి ప్రయోజనం ఏముంది ?. .అని ప్రశ్నించుకున్నాడేగాని అక్కడ నుంచి కదిలేందుకుమటుకు మనస్సును ఒప్పించ లేకపోయాడు!

ప్లేనులో మద్రాసులో దిగి మర్నాటికల్లా రైల్లో ఇంటికి చేరుకున్నాడు డాక్టర్ భాస్కరం. అతన్ని చూడగానే అనుకున్నాడు చలపతి "సావిత్రికీ, ఇతనికీ సాపత్యం లేదు. కాకిముక్కుకి దొండపండులాగా ఉంటుంది ఈమోటు మనిషికి సావిత్రినిస్తే! నవ్వుకున్నాడు తృప్తిగా చలపతి. కాని అంతలోనే "కేవలం ఈర్ష్యవలన అతను అలా కనిపిస్తున్నాడేమో ఏమయితేనేం లక్షాధికారి. పెద్ద డాక్టరవుతాడు. ప్చ్" బాధగా మూలిగాడు.

భాస్కరం మటుకు చాలా కలుపుగోలుగా మాట్లాడేస్తున్నాడు అతని ఆనందానికి హద్దులు లేకుండా ఉంది. ఇన్నాళ్ళ చదువు, తరువాత విదేశాలు వెళ్ళటాలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చిన తమ వివాహంకి ఇక ఎటువంటి అభ్యంతరాలు లేవన్న ఊహే అతని మనస్సుని తేలికపరిచేస్తోంది! చిన్నప్పటినుంచి కలలు కన్నాడు అవి ఈనాటికి సార్థకమవబోతున్నాయి సావిత్రి తనదవుతుంది. మగాడయినవాడికి అంతకన్న ఆనంద మేముంటుంది ?

చలపతిచరిత్ర విని భాస్కరం చాలా జాలి పడ్డాడు. అతన్ని మానసికంగా మార్చి మామూలు మనిషిని చేయటానికి శంకరం చేస్తున్న ప్రయ




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్శనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-18) Jullundur City.



రీటా కేశ సమస్యలను తీర్చును



అతి త్వరలో

ముడుల్లను బలపరచుటయే గాక, మనోహరమైన నిడుపాటి నల్లని శిరోజములను పెంపొందించును దీనిలో చేర్చిన ఔషధి సంపత్తివల్ల కేశములు ఊడిపోకుండగను, చుండ్రులేకుండగను, నెరవకుండగను రీటా కాపాడగలదు.

రీటాను కొబ్బరినూనెలోగాని, మంచినూనెలోగాని కలిపి నిత్యం వాడండి. తప్పకుండా మీ కేశములు నల్లబడతాయి. దీనిని మీరు వాడి, మీ స్నేహితులకు కూడ సిఫార్సు చేయండి.



రీటా

అందమైన కేశ సంపదకు

పీటో కంపెనీ, మద్రాసు-1

R-5 TG







# పునరావృతం

త్నాలు అతనికి పూర్తిగా నచ్చాయికూడా !

ఒక్కవారం కులాసాగా గడిచిపోయింది నలుగురూ కలిసి పిక్నిక్స్, సినిమాలతో రో. క్షణాలుగా గడిపేశారు చలపతి తను వాళ్ళ- అడ్డంగా ఉంటానన్న భావంతో తప్పుకుందామని చూసినా భాస్కరం అది పడనీయలేదు బలవంతంగా లాక్కుపోయేవాడు అతనితో హృదయం విప్పి మాట్లాడేవాడుకూడా

“సావిత్రి నాదికాని జీవితాన్ని నేను ఊహించలేను, చలపతిగారూ—అసలా అవసరమూ లేదనుకోండి సావిత్రికి నేనంటే చాలా ఇష్టం. నేను ఫారిన్ పోవడం నాకోసం అనుకున్నారా. నో నో !, ఫారిన్ వెళ్లితే నా కింకా పెద్ద ఉద్యోగం వస్తుంది. అప్పుడు సావిత్రి నింకా సుఖపెట్టవచ్చునని” అనేవాడు భాస్కర్ చనువుగా మాట్లాడుతూ

క్రమేణా భాస్కరంపట్ల తను ఎంత పొరపడిందీ గ్రహించుకున్నాడు చలపతి. సావిత్రిని భాస్కర్ చేసుకుంటేనే సుఖపడుతుంది. అమాయకంగా, సరదాగా మాట్లాడే అతనితో ఏ ఆడదయినా సుఖపడుతుంది!

వంటరిగా పార్కుకి వెళ్లి రాత్రి పొద్దుపోయాక ఆలోచనల్లోంచి తేరుకుని ఇంటికి బయల్దేరాడు చలపతి రేడియోల్లో ఇంగ్లీషు న్యూస్ వస్తోంది. తనింత ఆలస్య మయినందుకు వాళ్ళేమయినా అనుకుంటారేమోనని బాధపడుతూ గబగబ ఇల్లు చేరుకున్నాడు “బహుశా సినిమాకి వెళ్లాడని అనుకుని ఉంటారు” అనుకుంటూ మెట్లెక్కి వరండాలోకి వెళ్లాడు

హాల్లో చిన్నదీపం తప్ప ఇల్లంతా చీకటిగా ఉంది ఒక్క సావిత్రిగదిలో మాత్రం దీపం వెలుగుతోంది అందులోంచే పెద్దగా మాటలు వినబడటంతో అప్రయత్నంగా ఆగిపోయాడు—

“భాస్కరంబావలో ఏం లోపం కనపడింది — ఎందు కతన్ని చేసుకోనంటావు ?” అని అడుగుతున్నాడు శంకరం.

“లోపం ఉందని నే నన్నానా ? నేను చేసుకోలేను—అంతే!” అంది మొండిగా సావిత్రి

“ఆ చలపతి ఏవిషయంలో భాస్కర్‌కన్న మెరుగు ? ఏంచూసి అతన్ని ప్రేమించావు ?”

“ప్రేమించేందుకు అర్హతలు కావాలా అన్నయ్యా! డాక్టర్ పాసయావు ఆ మాత్రం మనస్సుని అర్థం చేసుకోలేవు ?

కాసేపు ఎవరూ మాట్లాడలేదు చివరికి శంకరం “నేనెంత బాధపడుతున్నానో నీకు తెలియదు చెల్లాయ్! భాస్కర్‌కి ఉజ్వలమయిన భవిష్యత్తు ఉంది పెద్ద పర్సనవుతాడు ఫారిన్ రిటర్న్‌డ్ మనం చిన్నప్పటినుంచి ఎరుగున్నవాడు అమాయకుడు నువ్వు అంగీకరించాలేగాని నిన్ను పువ్వుల్లోపెట్టి పూజిస్తాడు. నెత్తిమీద కెక్కించుకుంటాడు. బోలెడు ఆస్తి ఉంది. కారు, మేడ ...”

“అవును” అంది సావిత్రి.

“చలపతీ మంచివాడే నేను కాదనలేను అందమయినవాడు—కాని ఏవిటీ అతనికున్న అర్హతలు? దమ్మిడీ వెనకలేనివాడు. మామూలు గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు—అదికూడా నే నిప్పిస్తేనే

చేశాడు. ఒకభార్యతో సంవత్సరం కాపరం చేశాడు. కాలు పెట్టిన చోటల్లా భస్మంచేసుకొచ్చాడు. వచ్చి విరాశావాడి ? ఏం బావుకుంటావు అతన్ని చేసుకుని ?''

కాసేపు మళ్లీ నిశ్శబ్దం ఆవరించుకుంది.

''ఏమంటావు ?'' ఆశగా అడిగాడు శంకరం.

''నా నిర్ణయానికి తిరుగు లేదన్నయ్యా! నాకు తెలుసు—నేను చేస్తున్నది లోకందృష్టిలో తెలివి తక్కువవని అని. భాస్కరంకి అది ఎంత పెద్ద ఆశాభంగం కలిగిస్తుందోకూడా తెలుసు నాకు. కాని నేను బావని 'భర్తగా' ఊహించకోలేక పోతున్నాను. అతనిపట్ల నాకా ఉద్దేశ్యం అసలు లేదు.''

''మరి ఇదివరకు ఒప్పుకున్నావుగా !''

''అవును ఒప్పుకున్నాను — నామనస్సులో ఏముందో నాకే తెలియక !''

''ఇప్పుడు చలపతి అనే యుగపురుషుడు రావడంతో నీమనస్సులో ఏముందో గ్రహించావన్నమాట! .... సంతోషం సావిత్రీ చాలా సంతోషం. తెలిసినవాళ్లకి నచ్చచెప్పవచ్చు. తెలియనివాళ్లకి తెలియచెప్పవచ్చు. కాని తెలిసి తెలియని నీలాంటి వాళ్లకి .... బ్రహ్మతరంకూడా కాదు. ఒక్కటి మటుకు చెబుతున్నాను. నీ భవిష్యత్తు నువ్వే చేజేతులా నాశనం చేసుకుంటున్నావు. చలపతి నిజంగా నీ సుఖం, నీ ఆనందం కోరేవాడయితే నిన్ను పెళ్లిచేసుకునేందుకు ప్రాణం ఉండగా అంగీకరించడు .... మరొక్కసారి ఆలోచించమని చెప్పికూడా లాభం లేదనుకుంటా'' అని గది బయటికి వచ్చేశాడు శంకరం కోపంగా. మనస్సులోని బాధ అతనిముఖంలో వ్యక్తమవుతోంది.

చలపతి నిలువునా స్తంభించిపోయాడు. సావిత్రి తన్ను ప్రేమించుతోందన్నమాట అతనికి అంతులేని ఆనందాన్ని కలిగించింది కాని అంతలో శంకరం అన్న ఆఖరిమాటలు గుర్తుకొచ్చి ఛెళ్ళున కొట్టినట్లయింది.

''నిజంగానే భాస్కరంకి ఉజ్వలభవిష్యత్తు ఉంది. ధనికుడు. సావిత్రిని ప్రాణసమానంగా ప్రేమిస్తున్నాడు .... మరి తనూ ప్రేమించుతున్నాడుగా! కాని తనామెను సుఖపెట్టగలడా? కేవలం ఒక చిన్న గుమాస్తా — ఊహూ, సావిత్రి సుఖపడాలంటే భాస్కర్‌నే చేసుకోవాలి. అతన్ని చేసుకోవాలంటే తను .... తను .... '' అనుకుంటూ పిచ్చివాడిలాగా చీకట్లోకి పోయి తోటలో కూలబడ్డాడు.

మరికొంచెం సేపటికి అదే వరండాలోంచి మరోవ్యక్తికూడా విచారంగా బయటికి పోవడం చలపతికి తెలియదు.

మర్నాడుదయం కాఫీలు పుచ్చుకొని చలపతి కోసం బయలుదేరిన సావిత్రికి అతను తనకి గత సాయంత్రంనుంచి కనబడలేదన్న విషయం గుర్తుకొచ్చింది. ఎక్కడికి వెళ్లాడో అడగాలనుకుంటూ వస్తున్న ఆమెకి హడావుడిగా శంకరం ఎదురయాడు ''చూశావా సావిత్రీ, ఎంతపనయిందో'' అంటూ. అతను ఉద్రేకంతో ఒణికిపోతున్నాడు!

''ఏమయిందన్న''ట్లు చూసింది సావిత్రి.

''భాస్కరం ఉత్తరం రాసి కిటికీలోంచి పడేసి పోయినట్లున్నాడు. చదువు'' అనిచ్చాడు.

కాగితం తీసి చదువసాగింది సావిత్రి—

''డియర్ శంకర్,

రాత్రి భోంచేసి మీతో కబుర్లు చెబుదామని మీ ఇంటికి వచ్చాను. కాని గదిలో నువ్వు సావిత్రితో మాట్లాడుతూండటం విని అప్రయత్నంగా ఆగిపోయాను బయటే! మీ మాటలు పూర్తిగా విన్నాను. చాలా బాధకలిగిన మాట వాస్తవం. చిన్నతనంనుంచి సావిత్రి నాదవుతుందన్న నమ్మకంతో పెరిగాను. ఇప్పుడు అవన్నీ గాలిమేడ లయాయి .... ప్చ్, నా కదృష్టంలేదు .... నాకు కావలసింది సావిత్రి సంతోషంగా ఉండటం. చలపతి చాలా అదృష్టవంతుడు. వా రిద్దరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. కొన్నాళ్లపాటు దేశయాత్ర చేద్దామని బయలుదేరాను. ఆత్మహత్యలాంటిది చేసుకుంటానని భయపడకండి — నా కామాత్రం ధైర్యంలేదు. మా అమ్మని చూస్తుంటావుకదూ—సెలవు.''

"భాస్కర్"

భారంగా పూర్తిచేసింది సావిత్రి.

''పాపం అమాయకుడు'' అంది దుఃఖాన్ని గొంతులోనే ఆపుకుంటూ.

''చూశావా భాస్కరం ఎంత మంచివాడో. అతని భవిష్యత్తుని చేజేతులా నాశనం చేశాము'' అంటూనే సావిత్రితోపాటు చలపతి గదిలోకి వచ్చేశాడు శంకరం.

చలపతి మంచం ఖాళీగా ఉంది. పక్కకూడా నలగకపోవడం గమనించిన సావిత్రి ఆంగా తుగా చుట్టూ చూసింది. అంతలో శంకరం దృష్టి తలగడకి పక్కగా ఉన్న కవరుమీద పడింది. గబుక్కున అందుకుని చూసి ''నీకే'' అంటూ సావిత్రి చేతికిచ్చాడు.

ఆంగారుగా దాన్ని చొక్కుని చింపి చదవసాగింది సావిత్రి—

సావిత్రికి,

నిన్నరాత్రి మీ సంభాషణ విన్నాను. మీ అన్నయ్య చెప్పింది నాకూ సబబుగా తోచింది. భాస్కరం పసిపిల్లాడిలా అమాయకుడు. మంచి భవిష్యత్తుకలవాడు. అన్నిటినీ మించి నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడు. కాబట్టి మీ అన్నయ్య కోరిక ప్రకారం భాస్కరంని చేసుకోవలసిందని నా ప్రార్థన.

నీవంటి దానికి ఈ అదృష్టహీనుడు తగడు. నేను నీ కీయకలిగింది నా మనస్సు ఒక్కటే. నేను దరిద్రుడ్ని. నన్ను ప్రేమించినవారికి నావలన లభించింది — అధోగతి. అందుకే నీకు దూరంగా పోతున్నాను. నీ సంతోషమే నా క్కావలసింది. నువ్వు, భాస్కరం ఆనందంగా కలకాలం జీవించాలనీ నా వాంఛ. మధ్యలో వచ్చాను — మధ్యలోనే పోతున్నాను. నేను వెంట తీసుకు పోతున్నదల్లా మనస్సులో నిక్షిప్తమయిన నీ మూర్తి ఒక్కటే .... నన్ను మర్చిపోతావుకదూ !'' శంకరం గారికి నా నమస్కృతులు. సెలవు.''

చలపతి.

అని ఉంది.

శంకరం చైతన్యరహితంగా నిలబడిపోయాడు.

''నిన్ను ప్రేమించినవారి కందరికీ లభించేది కన్నీరే అన్నమాట నాపట్ల కూడా బుజువు చేశావు'' అంటూ ముఖం చేతుల్లో దాచుకుని వెక్కివెక్కి ఏడవసాగింది సావిత్రి! .... ★



మీ అందానికి
గ్లోరియా అనే సౌందర్యపోషక ద్రవం, ముఖిరూపును పోగొట్టి మీ ముఖానికి, చక్కని తేతదనాన్ని కాంతిని తెచ్చును మొటిమలు, మచ్చలు, ముడుతల్ను ఎండకు కమిలినలుపును పోగొట్టి, ముఖాన్ని తెలుపుచేసి మీ అందాన్ని రోజు రోజుకీ ఎక్కువ చేయును. మొదటి పూతలోనే కొంత అందము వచ్చును. వాడి చూస్తే విడువరు. అన్నిషాపులలోను దొరకును
జనితా ప్రొడక్ట్సు, ఏలూరు, (ఆంధ్ర).
దుర్గా ప్రాసెస్

తెల్ల వెంట్రుక లుండవు
రంగులు పూసి మోసపోవద్దు, అది తాత్కాలికము. మా సువాసన "తిల్యకళ్యాణ్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును. ఉన్మాదము తలనొప్పి వగైరా జబ్బుల రాపేయును "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒకసీసా రు 6. 3 సీసాలు రు. 15. సగము నెరసివుంటే ఒకసీసా రు 7. 3 సీసాలు రు. 18 పూర్తిగ నెరసి వుంటే ఒక సీసా రు. 8 లు 3 సీసాలు రు. 204 లు పనిచేయు లేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి ఫ్రీ.
INDRA AYURVED BHAVAN,
P. O. Rajdhanwar (H. Bagh)


పెప్స గొంతు, మరియు గుండె బిళ్లలను మీరు పీల్చేయడం మీ దగ్గు త్వరితంగా పోవును
పెప్స్ దగ్గరించి, నొప్పిని నివారించే ద్రవ్యాన్ని ఉపయుక్త అంటకి శమనకర ఆవిరులను అస్వాదించండి, అవి గొంతు నొప్పి, రొమ్ము పడిశము, దగ్గు లేక ఆయాసము గలిగించే క్రిములను చంపును. పెప్స్ శక్తి నివారణను గలిగించి క్రిములను నిర్మూలించును.
ఇంటిలో హానికర ఓషధులు లేవు పిల్లలకి సురక్షితంగా ఇవ్వవచ్చును.
రొమ్ము పడిశములు, గొంతు నొప్పి, పడిశము, అధిక కఫము బలుబులు, దగ్గులను త్వరితంగా నివారించును
మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి
ఎ. జ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
PPY-55-TE
సోల్ ఏజంట్లు : దాదా & కంపెనీ,
86, నైనప్పనాయక వీధి, మద్రాసు-8.